# మళ్ళీ ఎప్పటిలాగే

నిజంగా ఇంతకన్నా ఏం జరగలేదు.

తండ్రి బజార్నుంచివొచ్చి, మంచం వాల్చుకొని కూర్చుంటూ-ఎదురుగ్గా అరుగుమీద కూర్చున్న చిన్న కొడుకును చూసి, "ఏంరా! పొలం వెళ్ళలేదేం?" అన్నాడు, మామూలు గొంతుతోనే.

రాముడు మాట్లాడలేదు. వినిపించుకొని కూడా వినిపించుకోనట్టు మెదలకుండా వాడు వూరుకోవడంలో బ్రహ్మాండమైన నిగూఢార్థం ఉండి వుంటుంది. పైగా వాడు లోలోపల తన నిశ్చయాన్ని వొదలకూడదనుకొంటున్నాడు.

తండ్రికి ఆశ్చర్యంతోపాటు అరికాలి మంట నెత్తికెక్కడంలో వింతలేదు. ఆయనకు విశ్వామిత్రుడికోపం అనుక్షణమూ ముక్కుమీద తారాడుతూనే ఉంటుంది. ఆ కోపాన్ని, ఆయన ఎప్పుడూ - ముఖ్యంగా కొడుకులమీద ఒకే పద్ధతిలో ఉపయోగించి ఉపశమింప జేసుకోవటం కద్దు.

"ఏం మాయరోగం వచ్చిందా? అట్లా గోడకుచేరి గిలబడి కూర్చున్నావు. ఫో. పొలంవెళ్ళి కూలివాళ్ళతోపాటు గడ్డపని చేయి." అన్నాడు తండ్రి.

ఆ మొట్టమొదటి వాక్యానికి రాముడి హృదయంలో కొన్ని నెలలుగా జరుగుతోన్న సంఘర్షణకి పరిపక్వదశ వొచ్చింది. మనస్సు తిరగబడింది. అట్లా తండ్రి చాత మాటలు పడటం వాడికి కొత్తకాదు. కాని కొత్తగానే కోపం ప్రజ్వరిల్లింది. కొడుక్కి రావాల్సిన కోపానికి మించి వొచ్చింది. 'ఏమిటి తను - వెధవది, ముప్పొద్దులా గానుగ ఎద్దులాగా పనిచేయడం? అన్నయ్య అట్లా జల్సాగా తిరగడం ఎందుకని?' అనుకున్నాడు. కోపం చెమట రూపంలో ద్విగుణీకృతమైంది. తల పైకెత్తాడు. జులపాల క్రాపు అటూ ఇటూ ఊగింది.

"నే పొలంపోను" అన్నాడు గంభీరంగా. తండ్రిమీద తిరుగుబాటు చేసినట్టు గర్వపడ్డాడు, ఆ క్షణంలో రాముడు.

తోక తెగిన కోతిలాగా ఉగ్రుడయ్యాడు, తండ్రి. తన కొడుకు తనని ఎదిరించటం ఇదే ప్రథమం. పెద్దవాడు ఎంత చదువుకున్నా తనని ఎదిరించి యెరుగా? వీడు - ఈ వెధవాయి, తన మాటలు కాదననా? వీడికింత ఆలోచన ఎక్కణ్ణుంచి వచ్చింది? ఏ కారణం లేకండా కొడుకు పొలం వెళ్ళననటం పలువిధాల ఆలోచనలకు దారితీసింది. కాని తండ్రి ఆలోచించదలచలేదు. తాత్కాలికంగా వాడ్ని నానా చీవాట్లూ వేయదలిచాడు; వొచ్చిన కోపాన్ని అణచుకొనేందుకు.

"ఏం. అంత పొగరబోతుతనం బలిసిందా? వెధవా! పొలం పోకుండా కూడు ఎట్లా తింటావో చూస్తాను. కాస్త లేవ్వూ, వడ్లబస్తా ఎత్తలేవూ, అప్పుడే తండ్రిని ఎదిరించే ధీరుడవయ్యావూ! ఎదిరించు! ఒరేయ్-

“సంలోచన”

నువ్వు కిష్టయ్యగారి చెంచయ్యలాగా ఎందుకూ పనికిరాకండా పోతావని నేను యీక్షణాన వ్రాసియిస్తాను. ఏమిటనుకొంటున్నావో! తండ్రిని ఎదిరించినవాడు బాగుపడ్డట్టు ఏ చరిత్రలోనూ లేదు. నీకు చదువా - రాదు. ఇంక పొలంపని కూడా చేయక ఏం నిర్వాకం ఏడుద్దామని. అంట్ల వెధవా. సిగ్గు లేకుండా బెదిరింపా! ఎవరిమీదరా నీ బెదిరింపు! అర కోలీ విలవ చెయ్యవు. తండ్రిమీద తిరగపడటమా? ఎవరన్నా నూరిపోస్తున్నారా! నీ పాడుముఖానికే పుట్టిందా ఈ బుద్ధి."

రాముడు రోషంగా లేచాడు. తండ్రి వొంక తీక్షణంగా చూశాడు. ఏమిటో మాట్లాడాలని నోరు విప్పబోయాడు; మాటలు వూడిరాలేదు. కోపం, తండ్రిని నమిలి మింగేయాలన్న ఏదో ఆవేశం - వాడిలో ఉధృతం కాసాగి, తండ్రి ముఖాన అనదలచుకున్న నాలుగు మాటలూ అననివ్వలేదు.

'ఛీ, ఈ ఇంట్లో తను ఒక్క క్షణం ఉండరాదు' అనుకున్నాడు, రాముడు. వెంటనే బయలుదేరాడు బయటికి విసురుగా.

"అయ్యో! ఎక్కడికి వెళుతున్నావురా! ఒరేయ్ - రాముడూ!" అంటూ తల్లి ద్వారందాటి బయటికి వొచ్చింది.

అప్పుడే రాముడు గొంది దాటి వెళ్ళిపోయాడు.

"అంతతొందర పనికిరాదు, మనిషికి, ఎప్పుడూ వాడిమీదే విరుచుకు పడతారేం? పొండి. తీసుకురాండి, ఏం అఘాయిత్యం తలపెడతాడో!" అన్నది తల్లి కొడుకు విసురుగా పోవటంచూసి.

"ఏం ఫర్వాలేదు. ఎక్కడికి వెళ్ళడుతే" అన్నాడు తండ్రి, నిర్లక్ష్యంగా.

రాముడు అపోవటం పోవటం శివాలయం ప్రక్కనవున్న చెరువుగట్టు మీద మర్రిచెట్టుక్రిందకు పోయి కూర్చున్నాడు. ఆ చెట్టుక్రింద కూర్చుని కబుర్లు చెప్పుకొంటూన్న ఇద్దరు ముగ్గురుమనుష్యులు రాముడి వాలకొన్ని కనిపెట్టి అడిగారు, "ఏం రా అబ్బాయీ! ఇక్కడున్నావూ. ఏం పనులేవేమిటి?"

రాముడు నిశ్చలంగా ఉన్నాడు. ఇంకోసారి అడిగి, ఇంటిదగ్గర అలిగి వొచ్చిన బాపతని ఊరుకున్నారు.

తను ఇక ఆయింటిముఖం చూడకూడదు. తన నాయింట్లో 'కొడుకుగా' చూసుకొనే వాళ్ళు లేరు, ఒక్క తల్లి తప్ప. తను తండ్రికంత చేదేసిపోయాడు, ఎందుకో. తనకి చదువు చెప్పించలేదు. చదువురాదు. గొడ్డదగ్గర ఉండమన్నాడు. ఎందుకురాదు? నాలుగేళ్ళు ఆలస్యంగా వొచ్చేదేమో - రెండోక్లాసు రెండేళ్ళు తప్పినంతమాత్రం చాతనే చదువు రాకండా పోతుందా? ఆయనకు తనని చదివించాలని ఏకోశానా లేదు. వేలకువేలు పోసి అన్నయ్యను చదివిస్తున్నాడు. చదువుకోవటం చాతనే అన్నయ్యనంత గొప్పగా చూస్తున్నారు. ప్రొద్దున్నా, మధ్యాహ్నా మూ కాఫీయిస్తారు. తనకు జ్వరం వొస్తేనే తప్ప ఇవ్వరు. అన్నయ్య ఎన్ని సినిమాలకు వెళ్ళినా అడేమని అనేవాళ్ళు

# ★ మళ్ళీ ఎప్పటిలాగే! ★

లేరు. తను సినిమాకు అమావాస్యకో, పున్నమకో వెళితే ఆయన విరుచుకుపడతాడు. తిడతాడు. ఏమిటీ బానిస బ్రతుకు? పొలంలో ముప్పొద్దులా పనిచేసినా మెచ్చుకునేవాళ్లు లేరు. పైగా అది సరిగ్గా చెయ్యలేదు - ఇది సరిగ్గా చెయ్యలేదని చలాయింపు. మాట్లాడితే తిట్టటం. ఏం బ్రతుకు? వెధవ బ్రతుకు! వాళ్ళ వెంకట్టయ్య పొలంలో పనిచేస్తే - తండ్రి ఎంత మెచ్చుకుంటాడు. సినిమా కెళ్లాలంటే మాట్లాడకండా డబ్బులిస్తాడు. ఎన్నెన్ని మంచిగుడ్డలు కుట్టిస్తాడు. తన కేం కర్మం? అన్నయ్యకు కుట్టించే గుడ్డలలో సగం కుట్టించినా తను సంతోషపడును? వాడికంటె తనేం తక్కువ!

ఈవిధంగా రాముడు ఆత్మవిమర్శ చేసుకో మొదలెట్టాడు. వాడికి తను బ్రతుకే బ్రతుకు చాల నీచమైందని తెలుసుకున్నప్పట్నుంచీ ఆ బ్రతుకునుంచి ఏదో ఒకతిరుగుబాటు చేసి, బయటపడాలనే కుతూహలం కలుగుతూనే ఉంది. తెలివితేటలు అనేవి పుట్టినప్పుడు అందరిలోనూ సరిసమానంగానే ఉంటాయి- కాని, అవి ఒక్కొక్కరిలో నిశితంగా రాణించటానికిన్నూ, మరికొందరిలో ఏమీ రాణించలేక పోవటానికిన్నూ - ప్రధాన కారణం ఆ తెలివితేటలకు పరిపూర్ణస్వయాధానిచ్చి వినియోగించుకోవటంలో నిపుణతని ప్రదర్శించటం. అది చాతకాని వాళ్లు తెలివితక్కువ దద్దమ్మల్లాగా కనబడటమూ, అందరిచాతా తక్కువగా చూడబడటమూ మనం చూస్తున్నదే! పసిపాప చిరునవ్వులోని అమాయకత్వమే రాముడిలో ఉందనటానికి సందేహం అక్కర్లేదు. నిజంగా వాడికి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం, పరిస్థితుల్ని గమనించాల్సిన అవసరం - అకస్మాత్తుగా ఏర్పడలేదు.

మర్రిచెట్టుక్రింద కూర్చుని తనకర్తవ్యాన్ని నిర్ణయించుకున్నాడు, రాముడు. ఆ నిర్ణయానికి వాడు వొచ్చేందుకు దాదాపు ముప్పావు గంటపట్టింది. ఏమిటంటే అది: తత్‌క్షణం ఈ వూరినుంచి ఎక్కడికన్నా పారిపోయి కొన్నాళ్లపాటు బ్రతకటమే. ఎక్కడైనా బ్రతకటం వాడికి కష్టంగా తోచలేదు. పనిచేసుకొనేవాడికి బ్రతుకు చింత అక్కర్లేదనే అభిప్రాయానికి తెలిగ్గా గురయ్యాడు. పారిపోయి పట్టంలో సులభంగా బ్రతికి, మేడలు కట్టించినట్టు - వాడు ఒకటి రెండు సినిమాల్లో చూడటం కూడా జరిగింది. వాడు పారిపోయి ఎక్కడైనా బ్రతుకుదామనే నిర్ణయానికి రావటానికి అదొక కారణం కాకపోదు.

మర్రిచెట్టుక్రింద నుంచి లేచాడు, రాముడు. నేరుగా స్టేషన్‌కు వెళ్ళాలని బయలుదేరి స్టేషన్‌కు చేరుకున్నాడు. మనసులో చేసుకున్న నిర్ణయం ప్రకారమే వాడు పట్నం పోదలుచుకున్నాడు. ఆ నిర్ణయంయొక్క మంచిచెడ్డలు ఆలోచించడం వాడికి ఇష్టంలేదు. మంచో, చెడో - అనుకొన్న మార్గాన వెళ్లటానికి రాముడు చదువుకొంటే - ఇట్లా సాహసించి వుండేవాడు కాదు.

రైలు స్టేషన్లకి వొచ్చింది.

అందరితోపాటు రాముడూ ఎక్కాడు, బండి. కాని ఆ ఎక్కడంలో రాముడికీ, అందరికీ ఉన్న తేడా ఎక్కడంటే: రాముడు టిక్కట్టుకొనలేదు. అందరు టిక్కట్టుకొన్నారు. బండి బయలుదేరింది. టిక్కట్టుకొనకుండా బండి ఎక్కితే పట్టుకుంటారనే ఊహ వాడిలో వొచ్చింది కానీ భయపడాల్సిన అగత్యం లేకపోయింది. వాడిజేబుల్లో చిల్లికానీలేదు. వేలికి ఉంగరంమాత్రం వుంది.

*  *  *

పాపం రాముడు పట్నం చేరుకొనేప్పటికి చాలా అవస్థలకు గురికావాల్సి వచ్చింది. ముఖ్యంగా టిక్కట్టు లేకండా ప్రయాణం చేయటం వాడికి కొత్తకావటం చాత యిన్ని అవస్థలూ పడాల్సివొచ్చింది. దొంగచాటుగా, రైల్వే అధికారులకు కన్ను కప్పి ప్రయాణం చేయటం వాడికి తెలీకపోవటం మూలాన నాలుగైదుచోట్ల క్రిందకు దిగాల్సిరావటమూ, తిట్లు తినటమూ మొదలైనవి భరించాల్సిన గతి పట్టటమే కాకుండా - తగని ఆకలివేసి, 'తను ఎందుకు పట్నం వెళ్తున్నట్టు?' అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేని స్థితికి దిగజారటం జరిగింది.

అనుకున్నకాడికి రెండు రోజులు ఆలస్యంగా పట్నం చేరుకున్నాడు. ఈలోపల దారిపొడుగునా మంచినీళ్లు త్రాగి ఆకల్ని చంపుకున్నాడు.

మద్రాసు మహానగరాన్ని చూడటంతోటే వాడికి ఆకలిసంగతి గుర్తుకురాలేదు. ఆ మేడలు, బజార్ల మధ్యగా ట్రాములు పోవడం, వింత మనుష్యులు, ఆడవాళ్ళు సైకిళ్లు తొక్కుకుంటూ పోవడం, దుకాణాలు - అంతా కొత్తగా కనిపించినయ్. ఇన్నాళ్ళూ తను పల్లెటూళ్లో వెధవ జీవితం జీవించినట్టు నొచ్చుకోసాగాడు రాముడు. పల్లెటూళ్లో ఏముంది? చెరువు, మర్రిచెట్టు, పొలము, గుడి, రచ్చబండ, చావిడి, ఇల్లు, ఎడ్లబండి, ఊరికి దూరంగా రైలు— ఇంతేగా! అక్కడికీ - ఇక్కడికీ, ఛ— ఏం పోలిక? నిజంగా ఇదే స్వర్గలోకమంటే. సినిమాలు కూడా తయారుచేస్తారంట, ఇక్కడ. చూడాలి. సముద్రానికి కూడా వెళ్ళాలి. ఓడలు ఒక్కొక్కటి చిన్న పల్లెటూరంత ఉంటుందంట.

తను ఇక్కడకు పారిపోయి రావటమే మంచిదైంది. లేకపోతే ఆపల్లెటూళ్ళోవుంటే తను ఇదంతా చూసేవాడా? నాన్న కలలోనైనా పట్నం పంపించేవాడా? బజార్లో ఎలక్ట్రిక్ స్తంభంక్రింద నిలుచోని ఇట్లా సంతోషపడసాగాడు, రాముడు.

వాడికి తనఊళ్ళో బయలు దేరేప్పుడు కలిగిన సందేహమే మళ్ళీవొకసారి కలిగింది.


## అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు. (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తెలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోష్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

ఇంత మహాపట్నంలో తనకు తిండి దొరక్కపోతుందా అని.

కాని ఆరోజుసాయంత్రానికి వాడికి తెలిసి వొచ్చిందేమంటే, తనట్లా అభిప్రాయపడడం కేవలం పొరపాటని. ఆసాయంత్రంవరకూ ఎంత తిరిగినా వాడికి అన్నం దొరకలేదు. ఏ దుకాణందగ్గరికి వెళ్ళి అడిగినా 'ఫో.' అని చీదరించుకొనేవాళ్ళేగాని, 'ఇందా' అని కొస్త రొట్టెముక్కయినా ఇచ్చిన వాళ్ళులేరు. అప్పుడనిపించింది, వాడికి, ధర్మగుణానికి పల్లెటూళ్ళు ఇంత అధ్వాన్నంగా లేవని. ఆకలైన అనుక్షణమూ తను ఇంతదూరం రావడం వాడికి తెలివి తక్కువ అనిపిస్తోంది. ఇంటిదగ్గర తినే అన్నాన్ని తలుచుకున్న కొద్దీ ఆకలి, ఆరాటం అధికం కాసాగింది. కళ్లుపీక్కుపోయినయ్. నూనెలేక జులపాలజుట్టు రేగి మరీ అసహ్యంగాఉంది. గుడ్డలు మాసిపోయినయ్. తన ఊరివాళ్లు ఎవరేనా కనపడతారేమోనన్న ఆశని కళ్లల్లో పెంచుకుంటూ వెతకసాగాడు. లాభంలేకపోయింది. రాత్రి పడింది. మంచినీళ్ళు త్రాగి ఏదో అరుగు మీద పడుకున్నాడు. అర్ధరాత్రివరకూ వాడికి నిద్రపట్టలేదు. ఏడ్చాడు, ఇంటి దగ్గర అందర్నీ తలుచుకొని బావురుమన్నాడు. ఆరాత్రి వాడు గతిలేక వొక నిర్ణయానికి వొచ్చాడు. వెల్లవారిం తరువాత వ్రేలిన ఉన్న ఉంగరాన్ని అమ్మి కడుపునిండా కూడు తిందామని. ఈ నిర్ణయం చేసుకున్న పిదపనే వాడికి నిద్ర పట్టింది.

తెల్లవారింది. రాముడు నిద్రలేవలేదు. పిచ్చికలలు కంటూనే ఉన్నాడు. ఇంటి యజమాని కాలితో తన్నేవరకూ వాడికి మెలకువ రాలేదు. లేస్తూనే వ్రేలిన ఉన్న ఉంగరాన్ని తనివితీర చూసుకున్నాడు. కళ్లు నులుముకుంటూ బజార్న నడుస్తున్నాడు. సూర్యోదయం అయింది కాని ఎండ అగపడటంలేదు.

"ఏయ్! ఆగు" వెనకనుంచి ఎవరో బలంగా, అధికారంగా పిలిచారు. ఎప్పుడూ వినని గొంతే! ఆగి వెనక్కి తిరిగిచూశాడు, రాముడు.

"ఏ ఊరు నీది?" రాయిగుద్ది అన్నట్టు అన్నాడు. ఉలిక్కిపడ్డాడు, రాముడు. మనిషి భీకరంగా ఉన్నాడు. ఆజానుబాహుడు. లావుగా, బలంగా ఉన్నాడు. ఏం చేస్తాడో, ఎందుకు అట్లా అంటున్నాడో అంతుపట్టలేదు. 'ఏ వూరైతే నీకేం?' అని తనుకూడా భీకరంగా అందామనుకున్నాడు. కాని ఎందుచాతనో వొళ్ళు భయంతో వొణకసాగింది. అంచాత వాడి నోటినుంచి మాట రాలేదు.

"ఏ...ఏం...కు"మాటలు తడబడ్డాయి.

బూటుకాలు నేలకేసి కొట్టాడు. రాముడు వొణికిపోతున్నాడు.

"వెధవా! నిజం చెప్పు. చూస్తే దొంగలాగా ఉన్నావు. నీ జుత్తూ, నీ వాలకం, నీ గుడ్డలు - అంతా చూస్తే పచ్చి దొంగలాగా ఉన్నావు. పద పోలీసు స్టేషన్‌కు" అన్నాడు అధికారంగా.

రాముడి కాళ్ళక్రింద భూమి కదులాడింది. ఇంతలో ఇద్దరు ముగ్గురు చేరారు, అక్కడకు. అందరూ వింతగా చూస్తున్నారు.

"ఊఁ! పద పోలీస్ స్టేషన్‌కు" మళ్ళీ గద్దించాడు అతను.

రాముడికి వొళ్లు తెలీని భయం వేసింది. అక్కడివాళ్లు గుసగుసలు మొదలెట్టారు. అతను సి. ఐ డి. అట.

"లాభం లేదు. పోవాల్సిందే."అన్నాడు అక్కడికి చేరిన ఇద్దరు ముగ్గుర్లో ఒకడు.

"ఏదో పాపం. కనికరించండి"అన్నాడు ఇంకొకడు.

"ఛట్. వాగవాకు" అని చేతిలో ఉన్న లాఠీతో ఒక్కటి తగిలించాడు సి. ఐ. డి. కనికరించండి అన్నవాడ్ని. రాముడికి ఒకటి పడటం ఒక్కటే మిగిలింది.

"ఎక్కడ దొంగిలించాడో - చేతిన ఉంగరం కూడా ఉంది" అన్నాడు ఒకడు.

"అది సి. ఐ. డి.గారి కివ్వు. వొదిలిపెడతాడు" అన్నాడు, ఆ దెబ్బలు తిన్నవాడు మెల్లగా. సి. ఐ. డి.గారు వాడివంక భీకరంగా చూశారు.

రాముడికి ఏం తోచలేదు. ఆపాదమస్తకమూ వొణికిపోతున్నాడు. ఉంగరం తీసి సి. ఐ. డి. కిచ్చి, దయతలిచి వొదిలిపెట్టమని - కాళ్ళమీదపడ్డాడు రాముడు.

సి. ఐ. డి. ఉంగరాన్ని జేబులో వేసుకుంటూ "జాగ్రత్తగా మసలుకో, వెధవా. దయతలచి వొదిలిపెడుతున్నాను! అన్నాడు సి. ఐ. డి.

తరువాత సి. ఐ. డి, తనకు సలహాలు ఇచ్చిన (దెబ్బలుతిన్న వాడితో సహా) ఇద్దరూ కలిసి కాఫీహోటల్లోకి వెళ్ళటం స్వయంగా కళ్ళారా చూసి, బావురుమన్నాడు - రాముడు. పరిసరాలు నవ్వినై. ఏం చేయటం? కడుపులో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయి. అధ్వాన్నపు అడవి మధ్య ఉన్నట్టు తోచింది.

పట్నం ప్రజల్లో ఇంత మోసంఉన్నట్టు వాడికి తెలీదు. వాడి కలలన్నీ జారిపోయినయ్. బ్రతుకుమీద ఆశకూడా పోయినట్టు బాధ పడుతున్నాడు. ఎట్లా ఇంటికి చేరుకొనేది?

పది గంటలకు ఒక పావలాని సంపాదించ గలిగాడు, రాముడు. బస్ స్టాండ్ నుంచి ఇళ్ళకు సంచులు చేరవేయటంలో కూలిక్రింద వొచ్చింది, ఆ పావలా. ఆ పావలాలో, చాకలో కొంతవరకు కడుపునిండే చిరుతిండి తిని - నిండుగా మంచినీళ్లు త్రాగాడు.

'తను చేస్తూన్న పనేమిటి?' అనుకున్నాడు రాముడు, ఎండలో పన్నెండు గంటలప్పుడు బెడ్డింగు నెత్తిమీద పెట్టుకుని నడుస్తూ. ఇంతదూరం వచ్చిన తనకు ఈ దుర్గతేమిటి? శాస్తి జరగవలసిందే! ఏమిటి? ఎందుకు రావాలి? తండ్రి తిట్టినంత మాత్రంచాత పారిపోయి రావటమే? - ఇట్లా అకస్మాత్తుగా తనమీద ద్వేషం ప్రబలి

(19-వ పేజీ చూడండి)



ఇద్దరు వణిక్ ప్రముఖులు వియ్యంకుల మౌదామని నిశ్చయించుకొని, ఆ విషయమై ఒకనాడు ఎంతో సేపు మాట్లాడుకొన్నారు. ఆ తరువాత ఎవరివూరికి వారు వెళ్లిపోయారు. కానీ ఒకాయనకు ఎందుకో అనుమానంతోచి, రెండో ఆయనకు వుత్తరం వ్రాస్తూ "మొన్న మీతో వియ్యమందుకొనే విషయం ప్రస్తావించాను కానీ, అందుకు మీరు అంగీకరించారో, నిరాకరించారో సరిగా జ్ఞాపకం లేదు. కాబట్టి ఆవిషయాన్ని తేట పరుస్తూ వెంటనే జాబు వ్రాయించవలసిందని" ప్రార్థించాడు.

మూడో రోజున సమాధానం వచ్చింది. అందులో యిలా వుంది. "ఆరోజు నేను ఎందరితోనో మా పిల్లవాడి పెళ్లివిషయం మాట్లాడాను. వారిలో చాలా మందితో వియ్యం అందుకోలేనని చెప్పినట్లు మాత్రం నాకు బాగా జ్ఞాపకం వుంది కానీ, ఎవరెవరితో ఆమాట చెప్పానో యిప్పుడు ఎంత జ్ఞాపకం చేసుకొన్నా జ్ఞాపకం రావటం లేదు"

అయితే ఇంక..." "నీమెళ్ళో మూడు పేటల గొలుసును ఇలాతే."

"ఎందుకూ ?" "ఎదురింటాయన రోజూ నేను వీధిలోంచివస్తున్నప్పుడు మారేడియో వింటున్నావా ? అన్నట్టూ వీధి అరుగుపై నిల్చొని నావైపు చూస్తుంటే తలకొట్టేసినంత పనవుతోంది. గొలుసు అమ్మేసి సాయంకాలం ఇంటికివచ్చేటప్పుడు రేడియోకొని తెస్తాను. "చాల్చాలు ! కుప్పతగలేసి పేలాలు వేపుతారా ?" "ఏయ్, మరచిపోయినట్టున్నావ్ ఈ వారం నే చెప్పినట్టూ చెయ్యాల్సిందే." అని మూర్తి భల్లూకపట్టులో చిక్కుకున్న రాధకి గొలుసు ఇయ్యక తప్పింది కాదు. సాయంకాలానికి రేడియో ఇంట్లో రెడీ అయికూర్చుంది.

అనుకున్నాడు సాయంకాలం అయిదుగంటలకి ఆఫీసునుండి మూర్తి ఇంటికి వచ్చే సరికి రేడియో ముందుకూర్చుని రాధ సిలన్ నుండి రికార్డులు వింటోంది. మూర్తి ఫ్లాస్కులో కాఫీ త్రాగడం పూర్తిఅయేక "ఏం, పేకాడదామా?" అన్నాడు. "చాలు బాబు, ఈసారి పందెంగెలిచి, అవతల ఇంటాయనకి మోటారుసైకిలు ఉంది నేనూ కొనుక్కోవాలి - నీ నెక్లేస్ ఇచ్చెయ్యంటారు." తీరిందా సరదా ? నీ కాలక్షేపానికి రేడియో ఉందిగా ! ఇహ నేను క్లబ్బుకిపోతాను." అంటూ మెల్లిగా క్లబ్బుకి త్రోవతీసిన మూర్తి తనలో ఇలా అనుకున్నాడు "రేడియో ధర్మమా అంటూ ఈరోజు తో సతీమణితో చీట్లాట సమాప్తం.!" ★

# ★ మళ్ళీ ఎప్పటిలాగే! ★

(17-వ పేజీ తరువాయి)

పోతోంది. వొచ్చినందుకు తిట్టుకోసాగాడు. పశ్చాత్తాపపడుతున్నాడు.

"ఒరేయ్ ! రాముడూ !" కిసుక్కున వెనక్కు తిరిగాడు, రాముడు.

అన్నయ్య ! కాళ్ళమీదపడి బావురుమని యేడవాలనిపించింది. అన్నయ్యకు ముఖం ఎట్లా చూపించటం - ఈస్థితిలో. రాయిలా నిలుచుండి పోయాడు రాముడు. పట్టరాని దుఃఖం వాడిలో పొంగి పొర్లుకొస్తోంది.

అన్నయ్యకు తగని జాలివేసింది - తన తమ్ముణ్ణి ఈ స్థితిలో చూడటంతో. చిక్కి, శల్యమై పోయినందుకు అతనికి పెద్దవిచారం వేయలేదుకాని, 'కూలికి బెడ్డింగులు మోస్తున్నందుకు జాలీ, అవమానమూ వేశాయి.

"ఇంటి కెళ్దాం, వొస్తావా ?" అన్నాడు అన్నయ్య.

సమాధానంగా నోరువిప్పలేక పోయాడు, రాముడు. 'రాక ఏంచేస్తాను ?' అన్నట్టు తల ఆడించాడు. బెడ్డింగు యజమానికి వొప్పజెప్పి అన్నయ్య వెంట నడుస్తున్నాడు. కొంతదూరం వొచ్చాక "ఆకలి వేస్తోంది" అన్నాడు.

ఆ ఫలంగా హోటల్లోకి తీసుకెళ్ళి భోజనం పెట్టించాడు. కరువుదీరాతిన్నాడు. బయటికి వొచ్చారు. ఉంగరం సంగతీ, అసలు మద్రాసు ఎందుకు వొచ్చిందీ — ఎన్ని అవస్థలు పడ్డదీ అన్నయ్య అడిగి, చీవాట్లు వేస్తాడేమోనని రాముడు భయపడ్డాడు ; కాని అట్లా జరగలేదు, అన్నయ్య ఇప్పుడు తాను చీవాట్లు వేస్తే మరీ క్రుంగిపోతాడని తలచటం చాత. జట్కాలో స్టేషన్‌కు వెళ్ళారు.

*　　*　　*

తన ఊరుస్టేషన్లో కాలుపెడుతూ అనుకున్నాడు, రాముడు : 'మళ్ళీ ఎప్పటిలాగే...తన బ్రతుకు ఆరంభం కాబోతోంది. ముప్పొద్దులా గానుగ ఎద్దులాగా పొలంలో పనిచేయటం - చావట్లో పేడ కళ్లు తీయటం - తండ్రిచాత మాటలు పడటం...'

కాని రాముడు ఒకటి తలచలేదు, తను తన తండ్రికింద ఇదివరకన్నా తేలిక అవుతాడని!' ★

అంగనరముల బలహీనత పోగొట్టి, యథా ప్రకారం సంతోష సౌఖ్యముల కలిగించుటకు నపుంసక తైలం రూ. 10/-: వి. పి. రూ 1/-

యికమీదట గర్భం రాకుండా అవుటకు, లోపలికి సేవించే మందు, గర్భ విరోధిని 1 సీసా రూ. 10/- వి. పి. 1-0-0.

సిద్ధమకరధ్వజం మాత్రలు—శీఘ్ర స్ఖలనం ఆపి, కాళ్లు, నడుమునొప్పులు పోయి, ధాతుపుష్టి బలంకలిగించుటకు సీసా రూ. 10. వి.పి.1-0-0.

కావలసినవారు రూపాయ పంపేది.

డాక్టర్. రత్నం సన్స్ మెడికల్‌హాల్, మలకపేట, బిల్డింగ్స్ - హైద్రాబాదు.

దాంపత్య రహస్యము

తెలుగు భాష

ఇది ప్రాచీన అసలు కొక్కోక గ్రంథము. ఫోటోలతో 254 పుటల పుస్తకం. వెల : రు. 2-0-0 పోస్టుఖర్చులు ప్రత్యేకం. S. చంద్రభాను & కో. 7 బీటు, జి. టి. మద్రాసు.